సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



పోస్టుమార్టానికి పాట్లు!
బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీ గది నిర్వహణ కొరవడింది. ఇప్పటికే రోడ్డు విస్తరణలో గది సగానికి పైగా కోల్పోయింది. రోడ్డును ఆనుకునే గది ఉంది. 8లో▸



ఘనంగా వాజ్‌పేయి జయంతి
మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /13.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సింగరేణి ఎన్నికల్లో సహకరించాలి

మందమర్రిరూరల్: ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సింగరేణీయులు సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య కోరారు. సోమవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, నాయకులకు సూచించారు. కౌంటింగ్ సమయంలో సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 12గంటల వరకు సీఈఆర్ క్లబ్ ముందు కోల్‌బెల్ట్ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లించనున్నట్లు తెలిపారు. సింగరేణి పార్కు వెనుక వైపు ఒర్రెగడ్డ, మార్కెట్ మీదుగా సాయిబాబా ఆలయం ముందు నుంచి వెళ్లాలని సూచించారు. ఆ రోజు ఏరియాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రశాంతంగా ఓటింగ్ జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు.

'ఏరియా ఆస్పత్రికి పూర్వ వైభవం తెస్తా'



శ్రీనివాస్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రికి పూర్వ వైభవం తెస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, సింగరేణి గుర్తింపు ఎన్నికల్లోనూ ఐఎన్‌టీయూసీని గెలిపించడం వల్ల కార్మికులకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కార్మిక హక్కులు కాపాడుతామని, ఏరియా ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. టీబీజీకేఎస్ ఏరియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సోకాల శ్రీనివాస్‌తోపాటు ఫార్మాసిస్టు కిరణ్‌కుమార్, కార్మికులు, స్కావెంజర్లు ఐఎన్‌టీయూసీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వినోద్ కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఐఎన్టీయూసీ సింగరేణి విభాగం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమొగిలి, ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఎం.సూరిబాబు, శంకర్, జయరాం, నాతరి స్వామి పాల్గొన్నారు.

'సింగరేణిని సర్వనాశనం చేసిన టీబీజీకేఎస్'



మేనిఫెస్టోను వివరిస్తున్న ఎమ్మెల్యే వివేక్

కాసిపేట: గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ సింగరేణిని సర్వనాశనం చేసిందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ విమర్శించారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట–2 గనులపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని తెలిపారు. అవినీతి, అక్రమాలతో దోచుకోవడం లక్ష్యంగా టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కాలం గడిపారని ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, సిద్దంశెట్టి రాజ మౌళి, దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం తిరుపతి పాల్గొన్నారు.

'భట్టి'ని కలిసిన నాయకులు

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామానికి చెందిన ఓయూ జేఏసీ నాయకులు దుర్గం మల్లేష్ ఆధ్వర్యంలో డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కీలక భూమిక పోషించినందుకు ఆయనను కలిసినట్లు తెలిపారు. మండల సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గుర్తింపు ఎవరికో!



బెల్లంపల్లి ఏరియా కార్యాలయంలో సిద్ధంగా బ్యాలెట్ బాక్సులు

ఏరియాల వారీగా ఓటర్లు

శ్రీరాంపూర్	9124
మందమర్రి	4876
బెల్లంపల్లి	985

- ముగిసిన కార్మిక సంఘాల ప్రచారం
- చివరి రెండ్రోజులు హోరాహోరీ
- ఈసారి అన్ని సంఘాలకు ప్రతిష్టాత్మకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మిక గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. కోర్టులో విచారణలు, తీర్పుల మధ్య కార్మిక సంఘాల ఎన్నికల ప్రచారం పూర్తయింది. ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బరిలో నిలిచిన కార్మిక సంఘాలు హోరాహోరీగా గత వారం రోజులుగా ప్రచారం చేశాయి. ఈసారి కార్మిక సంఘాలు పొత్తులు లేకుండానే ఒంటరిగానే బరిలో దిగాయి. గత ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు తెచ్చుకుని గుర్తింపు సంఘంగా ఉన్న బీఆర్‌ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ ఈసారి ఇబ్బందుల్లో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభావంతో ఆ ప్రభావం కార్మిక క్షేత్రంలోనూ పడింది. మరోవైపు జిల్లా పరిధిలో మూడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలవడంతో ఆ సంఘ నాయకులు ఆందోళనలో పడ్డారు. దీంతో కీలక నాయకులు ఆ సంఘానికి రాజీమానా చేశారు. అంతేకాక పోటీపై తర్జనభర్జనలు జరిగాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ మధ్యే ప్రధాన పోరు సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్యేలు బొగ్గు గనులపై ప్రచారం చేశారు. శ్రీరాంపూర్ పరిధిలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మందమర్రి ఏరియాలో వివేక్, బెల్లంపల్లి పరిధిలో వినోద్ ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. మొదటగా ఎన్నికల ప్రారంభం నుంచి రాజకీయ నాయకులు ప్రచారం కోసం గనులపై రాలేదు. చివరి రెండు రోజులు మాత్రమే పాల్గొన్నారు. ఇక సీఐటీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ తదితర సంఘాలు గనులపై విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశాయి. 'గుర్తింపు' సంఘంగా తమనే గెలిపించాలని అనేక హామీలు ఇచ్చాయి.

సర్వత్రా ఆసక్తి

ఆరేళ్ల తర్వాత జరుగుతున్న గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఈసారి ఎవరికి ఆ అవకాశం దక్కుతుందోనని ఆసక్తి సర్వత్రా నెలకొంది. వరసగా రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా కొనసాగిన టీబీజీకేఎస్ ఈసారి బలహీన పడడంతో పోటీలో నామమాత్రంగా మారింది. ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కార్మికులు తమ సంఘాన్ని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు గనులపై వస్తే, మరింత వ్యతిరేకత వస్తుందనే వాదనతో అటువైపు చూడడం లేదు. 2017లో జరిగిన గుర్తింపు ఎన్నికల సమయంలో అప్పటి పెద్దపల్లి ఎంపీగా ఉన్న బాల్క సుమన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేలందరూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో ఆ సంఘ నాయకులే రాజీనామాలు చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ సంఘం హుషారుతో ఉంది. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడంతో కార్మికులు తమవైపే ఉన్నారనే నమ్మకంతో ఉన్నారు. అంతేకాక ముగ్గురు ఎమ్మెల్యేల గెలుపులో కార్మికుల ఓట్లు ఉండడంతో సింగరేణి కార్మిక గుర్తింపు సంఘ ఎన్నికల్లోనూ తమవైపే ఉంటారనే ఆశలు పెట్టుకున్నారు. ఇక ఎన్నికల నిర్వహణ కోసం పట్టుబట్టి కోర్టు మెట్లెక్కి కొట్లాడిన ఏఐటీయూసీ సైతం గట్టిగానే గెలుపు కోసం పోరాటం చేస్తోంది. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల అనుబంధ కార్మిక సంఘాలను గెలిపిస్తే ప్రయోజనం ఉండదనే వాదనను గనులపై బలంగా వినిపిస్తున్నారు. కార్మికులకు తమతోనే మేలు జరుగుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మిగతా హెచ్ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూసీ తదితర సంఘాలు సైతం 'గుర్తింపు' తెచ్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాయి. వీలైనంతగా కార్మికుల ఓట్లు రాబట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈసారి ఏ సంఘాన్ని గని కార్మికులు తమ ప్రాతినిధ్య సంఘంగా ఎన్నుకుంటారనేది మరో రెండు రోజుల్లో తేలనుంది.

అవిశ్వాసానికి వేళాయె

- 12న బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం



బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాల్టీలో అవిశ్వాసానికి సమయం ఆసన్నమైంది. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌లపై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ 22మంది కౌన్సిలర్లు ఈ నెల 7న కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. నోటీసు ఆధారంగా కలెక్టర్ అవిశ్వాస తీర్మానంపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే సభ్యుల సంతకాలను పరిశీలించి సరైనవేనని ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు. జనవరి 12న మధ్యాహ్నం 12.30గంటలకు మున్సిపల్ సమావేశం నిర్వహించనున్నారు.

ఏకపక్షంగా వ్యవహరించడంతో..
చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, సభ్యుల మధ్య రెండేళ్లకు పైబడి నుంచి సఖ్యత లేకుండా పోయింది. బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికైన చైర్‌పర్సన్ శ్వేత ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ మున్సిపాల్టీలో అన్నీ తామై వ్యవహరిస్తూ సభ్యులను లెక్క చేయడం లేదనే విమర్శలున్నాయి. అభివృద్ధి పనుల నిధుల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, సభ్యుల ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఏకపక్షంగా వ్యవహరించడం వంటి విమర్శలు వచ్చాయి. ఇన్నాళ్లూ గూడుకట్టుకున్న ఆవేదనను అవిశ్వాస నోటీసు రూపంలో బహిర్గతం చేశారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే తలంపులో ఉన్నారు.

వేడెక్కిన రాజకీయాలు

మున్సిపల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. సభ్యులు అవిశ్వాసం నోటీసు కలెక్టర్‌కు అందజేసిన రెండ్రోజుల్లో చైర్‌పర్సన్ శ్వేత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేశారు. వైస్ చైర్మన్ సుదర్శన్ బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. ఆ ఇద్దరిపై అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన వారిలో కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర సభ్యులతోపాటు బీఆర్‌ఎస్ సభ్యులు ఉండడం గమనార్హం. మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా ఓ వార్డు సభ్యుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో సభ్యుల సంఖ్య 33కు చేరింది. వీరిలో వైస్ చైర్మన్, నలుగురు స్వతంత్ర సభ్యులను కలుపుకొని బీఆర్‌ఎస్ పార్టీ సభ్యుల సంఖ్య 23 ఉండగా, కాంగ్రెస్ సభ్యుల బలం 9, బీజేపీ తరఫున 1 ఉన్నారు. అవిశ్వాసాన్ని కోరుతూ సభ్యులు పార్టీలకతీతంగా సంతకాలు చేయడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా.. వీగుతుందా అనే ఆసక్తి పురప్రజల్లో ఉత్కంఠ రేపుతోంది.

చైర్మన్‌పై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారు

- జనవరి 12న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- చైర్మన్‌పై అవిశ్వాసానికి ఓటింగ్
- ఇదివరకే వైస్‌చైర్మన్ రాజీనామా
- సమావేశానికి అధికారుల ఏర్పాట్లు

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 18న చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్ సంతోష్‌కు కౌన్సిలర్లు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. దీంతో అవిశ్వాసంపై చర్చ, ఓటింగ్‌కు జనవరి 12న ఉదయం 11గంటలకు మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేయాలని, కౌన్సిలర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ సోమవారం మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ రోజు జరిగే సమావేశంలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి నెగ్గేలా కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇప్పటికే సిద్ధమయ్యారు.

అధికార మార్పిడితో..
ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మంచిర్యాల నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. మున్సిపాల్టీల్లో చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానాలకు సిద్ధమవుతున్నారు. నస్పూర్‌లో మెజార్టీ సభ్యులు నోటీసు అందజేశారు. నోటీసు అందించిన రోజే వైస్‌చైర్మన్ తోట శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేస్తూ లేఖను కలెక్టర్‌కు అందజేశారు. మెజార్టీ సభ్యులు సంతకాల నోటీసును పరిశీలించిన కలెక్టర్ సమావేశానికి నిర్ణయం తీసుకున్నారు.

మారిన బలాబలాలు..
మున్సిపాల్టీలో 25 స్థానాలకు గాను 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 10, కాంగ్రెస్ 6, బీజేపీ 3, సీపీఐ 2, స్వతంత్రులు 3, ఏఐఎఫ్‌బీ 1 కౌన్సిలర్ గెలుపొందారు. ముగ్గురు స్వతంత్రులు, ఏఐఎఫ్‌బీ కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌లో చేరడం, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్‌గా ఈసంపల్లి ప్రభాకర్, వైస్‌చైర్మన్‌గా స్వతంత్ర కౌన్సిలర్ తోట శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం బీఆర్‌ఎస్ కౌన్సిలర్ బండారి సంధ్యారాణి కాంగ్రెస్‌లో, బీజేపీ కౌన్సిలర్లు కోడూరి లహరి, బేర సత్యనారాయణ, కాంగ్రెస్ కౌన్సిలర్ కెడిక ప్రకాశ్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ బలం 15కు చేరింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పరిణామాలతో కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకున్నాయి. ఇటీవల పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా, ఆదివారం కౌన్సిలర్ మడిగ మల్లయ్య ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు ఆరుగురు సభ్యుల బలం ఉండగా, కాంగ్రెస్‌కు 16 మంది, బీజేపీ 1, ఇద్దరు సీపీఐ సభ్యుల మద్దతు ఉంది. దీంతో కాంగ్రెస్ బలం 19కి చేరింది. దీంతో అవిశ్వాసం నెగ్గడం తేలికేనని ఆ పార్టీ భావిస్తోంది.

చైర్మన్‌గా సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్‌గా గెల్లు రజిత?
అవిశ్వాస తీర్మానం నెగ్గితే తదుపరి చైర్మన్‌గా ప్రస్తుత కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, వైస్ చైర్‌పర్సన్‌గా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గెల్లు రజిత అవకాశం దక్కించుకోవడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

ఘనంగా క్రిస్మస్



మంచిర్యాల సీఎస్ఐ చర్చి వేడుకల్లో క్రైస్తవుల ప్రార్థనలు

జిల్లాలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. మంచిర్యాలలోని హమాలీవాడ సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కాసిపేట మండలంలోని కల్వరి మినిస్ట్రీలో జరిగిన కార్యక్రమాలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. - వివరాలు 9లో▸



జన్నారం: పొనకల్‌లో కేక్ కటింగ్



చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలో..



మంచిర్యాల సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

'కార్మికులకు అండగా ఉంటా'



ఆర్కే 7 గనిపై మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు అండగా ఉంటానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. సోమవారం ఆర్కే 7, న్యూటెక్, ఏరియా వర్క్‌షాప్ గనులపై ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. కార్మికులకు యాజమాన్యం నుంచి రావాల్సిన హక్కులు, సదుపాయాలు కల్పిస్తానని అన్నారు. ఇప్పటివరకు కార్మికులు ఏ పని కోసం వెళ్లినా లంచాలు ఇవ్వాల్సి వచ్చిందని, ఇకముందు అలాంటి పరిస్థితి ఉండదని, పైసా ఇవ్వకుండా పనులు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న ప్రతీ అంశాన్ని గెలిచిన తర్వాత నెరవేర్చుతామని అన్నారు. కొత్తగనులు తీసుకువస్తామని, సొంతింటి పథకం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం కూడా ఇప్పిస్తామని తెలిపారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో గనులపై ఆ యూనియన్ నేతలు గేట్‌మీటింగ్ నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, కలవేని శ్యాం, జాతీయ సమితి సభ్యులు భీంరావు, నాయకులు తిరుపతిరెడ్డి, బుస రమేష్, తిరుపతి, రౌతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ గెలిస్తేనే కార్మికులకు హక్కులు'



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో ఏఐటీయూసీ గెలిస్తేనే కార్మికులకు హక్కులు, సదుపాయాలు వస్తాయని ఆ యూనియన్ అధ్యక్షుడు వీ.సీతారామయ్య అన్నారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఎస్సార్పీ 3, 3ఏ గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో సుదీర్ఘ పోరాటాలు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఒక్క ఏఐటీయూసీకి మాత్రమే ఉందన్నారు. సర్కార్ సంఘాలను గెలిపిస్తే సంస్థను ప్రభుత్వానికి తాకట్టు పెడతారని ఆరోపించారు. ఇప్పటికే సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో ఆయా గనులపై యూనియన్ నేతల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు ఎం.కొమురయ్య, కిషన్‌రావు, చంద్రమోహన్, మురళిచౌదరి, అఫ్రోజ్ ఖాన్, గండి సతీష్ పాల్గొన్నారు.

'హక్కులను కాలరాశాయి'



మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

నస్పూర్: సింగరేణిలో కార్మికుల హక్కులను ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కాలరాశాయని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య విమర్శించారు. సోమవారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గోల్డెన్ హ్యాండ్ షేక్ పథకంతో సుమారు 25 వేల మంది కార్మికుల ఉద్యోగులను తొలగించిన ఘనత ఏఐటీయూసీదేనని ఆరోపించారు. పలు ఏరియాల్లో కార్మికులను డిస్మిస్ చేసినా ఏఐటీయూసీ నాయకులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ ముసుగులో టీబీజీకేఎస్ నాయకులు మళ్లీ కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తమ సంఘాన్ని గెలిపిస్తే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బ్రాంచి కార్యదర్శి అనిల్‌రెడ్డి, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కామెర గట్టయ్య, కో కన్వీనర్ గోపాల్, నాయకులు దుర్గం లక్ష్మణ్, నర్సయ్య, అశోక్, పల్లె క్రాంతికుమార్, ప్రదీప్‌రెడ్డి, విక్రమ్, తులా అనిల్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధం

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- నారుమడులు తయారీలో రైతన్నలు బిజీ
- అక్కడక్కడ వరినాట్లు ప్రారంభం

బెల్లంపల్లి: యాసంగి(రబీ)లో వరి పంట సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. బోర్లు, వ్యవసాయ బావులు, వాగుల ఆధారంగా వరి సాగుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ముగియక ముందే యాసంగి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో 1,10,000 ఎకరాల్లో వరి పంట సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇదే సీజన్‌లో గతేడాది 1,05,000 ఎకరాల్లో వరి పండించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ట్రాక్టర్లతో దుక్కులు దున్ని, నారుమడులు పోసుకునే పనుల్లో రైతులు బీజీ అయ్యారు. అక్కడక్కడ నాటు వేత పనులు కూడా సాగుతున్నాయి. లక్సెట్టిపేట, దండేపల్లి, భీమారం, కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల, కన్నెపల్లి, బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో వరి నాట్లు మొదలయ్యాయి. మెజార్టీ రైతులు నారుమడుల తయారీ, మొలక అలికే పనుల్లో ఉన్నారు.

దొడ్డు రకాలకు ప్రాధాన్యం
వానాకాలంలో సన్నరకాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వగా యాసంగిలో దొడ్డు రకాలు పండించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సన్న రకాల్లో జైశ్రీరామ్, చిట్టిముత్యాలు, హన్మాన్ గోల్డ్, హెచ్ఎంటీ, నూజివీడు శ్రీ, కున్నారపు సన్నాలు తదితర రకాలను సాగు చేయగా యాసంగిలో దొడ్డురకాలను ఎంచుకుంటున్నారు. వీటిలో 1010, బతుకమ్మ, 1156, 55ఆర్ తదితర రకాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. చీడపీడలను తట్టుకుని, అధిక దిగుబడిని ఇచ్చే రకాలపై మొగ్గు చూపుతున్నారు.

బోర్లు.. బావులు ఆధారంగా..
జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అంతంత మాత్రంగా ఉన్నాయి. వీటి ఆధారంగా నిర్మాణం చేసిన కాలువలు తీవ్ర దుస్థితిలో ఉన్నాయి. ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోక నిరాదరణకు గురవుతున్నాయి. ఈ కారణంగా ఖరీఫ్‌లోనూ ఆయకట్టు చివరి భూములకు పూర్తిస్థాయిలో నీటితడులు అందడం లేదు. నీల్వాయి, నల్లవాగు, మత్తడివాగు తదితర ప్రాజెక్టులు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా లక్ష్యానికి అనుగుణంగా ఖరీఫ్, రబీలో నీటితడులు అందించడం లేదు. దీంతో ప్రాజెక్టులపై భరోసాను కోల్పోయి బోర్లు, బావులు, వాగులు, చెరువులను ఆధారం చేసుకుని వరి సాగు చేస్తున్నారు. పొలాల్లో బోర్లు వేయించుకుని అత్యధిక మంది రైతులు వరి పండిస్తుండగా, బావులు, వాగుల ఆధారంగా అత్యల్ప సంఖ్యలో వరి సేద్యం చేస్తున్నారు.



మడిలో నారుపోస్తున్న రైతులు

నారుమడులు పోసుకుంటున్నం



అష్టకష్టాలు పడి సాగు చేసిన వానాకాలం వరి పంట చేతికందింది. వారం రోజుల క్రితమే కోత పనులు పూర్తయ్యాయి. ఇంకా ధాన్యం కూడా అమ్మకాలు జరగలేదు. రబీలో వరి పంట సాగు ఆలస్యం కావద్దని నారుమడులు పోస్తున్న. ఇంకోపక్క పొలం దున్ని సిద్ధం చేస్తున్న. ఎండాకాలం ముదరక ముందే పంట అందేలా వేగిర పడి పనులు షురు జేసిన.

– చింత విఘ్నేష్, రైతు

దొడ్డు రకాలు మేలు



పల్లెల్లో ఖరీఫ్ సీజన్ ఇంకా ముగియక ముందే రైతులు రబీ పంటసాగుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పొలాల్లో దుక్కులు దున్నించడం పనులు ముమ్మరం చేసి వరి నారుమడులు పోసుకుంటున్నారు. రబీ సీజన్‌లో ప్రధానంగా దొడ్డు రకాలను ఎంచుకుని పంట పండించడానికి సన్నద్ధమవుతున్నారు. ఏ గ్రామంలో చూసిన వ్యవసాయ పనులు దర్శనమిస్తున్నాయి.

– ఎల్తూరి సురేఖ, ఏడీఏ, బెల్లంపల్లి

క్లుప్తంగా

మహిళపై పిచ్చికుక్క దాడి



గాయాల పాలైన సుక్రుబాయి

బెజ్జూర్(సిర్పూర్): పిచ్చికుక్క దాడిలో మహిళకు గాయాలైన ఘటన కుకుడలో చోటు చేసుకుంది. మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన సడమేక సుక్రుబాయి సోమవారం కోర్తేగూడ గ్రామ సమీపంలోని పత్తి చేనుకు పత్తి ఏరేందుకు వెళ్తుండగా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు.

పురుగుల మందుతాగి యువకుడు బలవన్మరణం



శంకర్(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: పురుగుల మందుతాగి యువకుడు బలవన్మరణం పొందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన ఇటాంకర్ శంకర్ (22) సోమవారం తమ పత్తి చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. యువకుని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

కాసిపేట: పోలీసు సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. సోమవారం మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే తనిఖీ చేయాలన్నారు. పెట్టిన కేసులకు కోర్టు ద్వారా అనుమతి తీసుకుని చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయాలన్నారు. ఆర్థిక నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎంఎస్‌ను గెలిపిస్తే కొత్త గనులు తెస్తాం



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపిస్తే నూతన భూగర్భ గనులను తీసుకొస్తామని, తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం ఆర్కే 5 గనిపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగరేణి కార్మికులకు న్యాయం జరగాలంటే బీఎంఎస్ గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వేజ్‌బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు పులి రాజారెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాసెట్టి నాగేశ్వరరావు, రాజేందర్, వసంతరావు, భీమయ్య, చంద్రశేఖర్ పురుషోత్తమచారి, కాంపల్లి తిరుపతి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టుమార్టానికి పాట్లు!

- రోడ్డు విస్తరణలో సగానికి కోల్పోయిన మార్చురీ గది
- శవాగారంలో కానరాని బాడీ ఫ్రీజర్స్
- ఏసీ సౌకర్యం ఎరుగని వైనం
- కష్టతరమవుతున్న మృతదేహాల భద్రత
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బెల్లంపల్లిలోని మార్చురీ గది

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీ గది నిర్వహణ కొరవడడంతో అధ్వానంగా తయారైంది. సరైన వసతి, సౌకర్యాలు లేక మృతదేహాలను భద్రపర్చలేని దుస్థితి. పోస్టుమార్టం నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీస సదుపాయాలు లేక మార్చురీ సమస్యలకు నిలయంగా మారింది. దశాబ్దాలుగా తీవ్ర నిరాదరణకు గురవుతోంది. సదుపాయాల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు విస్తరణలో...

జాతీయ రహదారి విస్తరణ మార్చురీ గదికి శాపమైంది. హైదరాబాద్–చంద్రపూర్ జాతీయ రహదారి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ముందు నుంచి వెళ్తోంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మార్చురీ గది సగం వరకు కోల్పోవాల్సి వచ్చింది. ప్రహరీని పూర్తిస్థాయిలో పడగొట్టారు. ఈ పరిణామాల క్రమంలో గది అనివార్యంగా రోడ్డెక్కింది. జాతీయరహదారికి అనుబంధంగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డు భూభాగంలోకి వచ్చేసింది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో ఆరుబయటే మృతదేహాలకు పోస్టుమార్టం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా పట్టింపులేని ధోరణి ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పడిపోతున్న ప్రహరీ

ఏరియా ఆస్పత్రికి దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రహరీ క్రమంగా కూల్చివేతకు గురై ఆనవాళ్లు లేకుండా పోతోంది. ప్రస్తుతం ఆస్పత్రి ముందు భాగంలో ఉన్న ప్రహరీ జాతీయ రహదారి విస్తరణలో కూల్చివేతకు గురైంది. పాత భవనం పక్కనున్న ప్రహరీని రాకపోకలు సాగించడానికి వీలుగా కొందరు పడగొట్టారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో మూగజీవులు సంచరిస్తున్నాయి. ప్రహరీని పునర్నిర్మించాల్సి ఉండగా పట్టింపులేని ధోరణి ప్రదర్శిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం

జాతీయ రహదారి విస్తరణలో మార్చురీ గది సగం వరకు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పోస్టుమార్టం చేయడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. కొత్త గది నిర్మాణానికి, మార్చురీలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం, కూల్చివేతకు గురైన ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు నాలుగు నెలల క్రితం ప్రతిపాదనలు పంపాం. ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. ఎమ్మెల్యే వినోద్ దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– డాక్టర్ జీ.రవి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, బెల్లంపల్లి

మృతదేహాల స్టోరేజీ ఏదీ?

పోస్టుమార్టం గదిలో మృతదేహాలను భద్రపర్చడానికి కనీసం నాలుగైదు బాడీఫ్రీజర్లు అందుబాటులో ఉంచాల్సి ఉండగా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. నెలకు గరిష్టంగా 20 వరకు మృతదేహాలు బెల్లంపల్లి మార్చురీకి వస్తుంటాయి. రైలు, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను కొన్నిరోజుల పాటు మార్చురీలో భద్రపర్చాల్సి ఉంటుంది. ఒక్కోసారి రెండు, మూడు వరకు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు వస్తుంటాయి. వీటిని భద్రపర్చడానికి బాడీఫ్రీజర్లు అవసరం. అవి లేకపోవడంతో మృతదేహాలు కుళ్లిపోయి దుర్వాసన వేసిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పాలకులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్చురీలో ఏసీ, ఇతర సౌకర్యాలు కల్పించడంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా మృతదేహాల నుంచి వెలికి తీసిన ఆర్గాన్స్‌ను భద్రపర్చడానికి పోస్టుమార్టం గదికి అనుబంధంగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆడిుసే లేకుండా పోయింది.

ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీగా సూర్యనారాయణ



మిట్ట సూర్యనారాయణ

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాకు చెందిన మిట్ట సూర్యనారాయణను ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ జనరల్ సెక్రెటరీగా నియమిస్తూ ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రక్షణ చర్యలపై సమీక్ష



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం(కార్పొరేట్)

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రక్షణ చర్యలపై జీఎం మనోహర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సేఫ్టీ జీఎం(కార్పొరేట్) గురువయ్య హాజరై ఏరియాలోని గనుల్లో విధి నిర్వహణలో తీసుకుంటున్న రక్షణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతుండడంతో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలన్నారు. సమావేశంలో బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ ఏజీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఎస్వో రవీందర్, ఐఈడీ రాజన్న, ఏజెంట్లు రామదాసు, విజయప్రసాద్, ఏరియాలోని అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

శేజల్ కారుపై రాళ్లతో దాడి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలో ఆరిజిన్ డెయిరీ సీఏవో బోడపాటి శేజల్ కారుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. బాధితురాలి కథనం ప్రకారం... డెయిరీ సీఈవో ఆదినారాయణతో కలిసి కారులో వెళ్తుండగా బెల్లంపల్లి–తాండూర్ మార్గమధ్యలో ఉన్న తిరుమల హిల్స్ ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ఆకస్మికంగా కారుపై రాళ్లు విసిరారు. ఈ ఘటనలో కారు అద్దం ధ్వంసమైంది. ఈ ఘటనపై బాధితురాలు తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



కాసిపేట గనిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట 2గనులపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపిస్తే కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి రాజమౌళి, సెంట్రల్ కమిటీ సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్, నాయకులు కారుకూరి రాంచందర్, బండి ప్రభాకర్, రవీందర్, సిద్దం తిరుపతి, సామల లక్ష్మణ్, నస్పూరి నర్సింగ్, మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘పెన్షన్ పెంపునకు కృషి చేయాలి’



లేఖ విడుదల చేస్తున్న వెంకటయ్య

నస్పూర్: సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపునకు జాతీయ, ప్రాంతీయ సంఘాలు కృషి చేయాలని తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య కోరారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నాయకులతో కలిసి పలు డిమాండ్లతో కూడిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 1998 నుంచి నేటి వరకు ఒక్కసారి కూడా పెన్షన్ పెంచలేదన్నారు. ప్రతీ మూడేళ్లకోసారి రివ్యూ చేసి పెన్షన్ పెంపుదలపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, కార్యదర్శి కే.రాజన్నగౌడ్, నాయకులు శంకర్‌రావు, పోత విష్ణు, మనోహర్‌రావు, కే.రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



కేకే–5 గనిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. సోమవారం మందమర్రి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లపై ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన గనుల ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజన్‌తో ఉందన్నారు. గత ప్రభుత్వం బకాయి పడిన 29 వేల కోట్లు దఫాల వారీగా చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు టీబీజీకేఎస్, ఇతర యూనియన్లకు చెందిన నాయకులు ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

నూతన బొగ్గుగనులు ఏర్పాటు చేస్తాం

రామకృష్ణాపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే నూతన బొగ్గు గనులు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీ, ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌పీలలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థను ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రైవేటుపరం కానివ్వమని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికవర్గానికి అన్ని విధాలుగా అండగా ఉంటారన్నారు. ప్రభుత్వ అనుబంధ సంఘాన్ని గెలిపిస్తే కార్మికుల సమస్యలు పరిష్కరించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, తేజావత్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రచారం బంద్.. ప్రలోభాలు షురూ

- క్వార్టర్లు, బిర్యానిప్యాకెట్ల పంపిణీ మొదలు పెట్టిన ప్రధాన కార్మిక సంఘాలు
- యూత్‌కు పెద్దపీట
- నేడు చివరి రోజు.. మరింత జోరు



శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం ముగిసింది. 27న ఎన్నికలు ఉండడంతో నియమావళి ప్రకారం సోమవారం సాయంత్రం 5 గంటల వరకే కార్మిక సంఘాలు ప్రచారం ముగించాయి. ప్రధానంగా రెండు జాతీయ సంఘాలు ఈసారి ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ప్రలోభాలకు తెరలేపాయి. శ్రీరాంపూర్ లాంటి పెద్ద ఏరియాలో మెజార్టీ వస్తేనే గుర్తింపు కైవసం చేసుకోవచ్చని నాయకులు ఇక్కడే తిష్టవేసి కార్మికులను తమవైపు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే గని పిట్ కమిటీ నేతలు వారి క్యాడర్, సానుభూతి పరులైన కార్మికులు, తటస్థ కార్మికులను సమీకరించి వారిని విందులతో ముంచెత్తారు. ఒక సంఘం నాయకులు మద్యం బాటిళ్లను అందిస్తే, మరో సంఘం గనులపైనే విందులు ఏర్పాటు చేసింది. బ్యాచ్‌ల వారీగా గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారాలు నడిపించారు. కొన్ని గనులపై డ్యూటీ చేసి పైకి వచ్చిన వారికి బిర్యాని ప్యాకెట్లు అందించారు. ఈ రెండు సంఘాలు ప్రధానంగా యూత్ ఓట్లను టార్గెట్ చేశాయి. డివిజన్ కమిటీ నేతలు ఎప్పటికప్పుడు పిట్ కమిటీ నాయకులను సమన్వయం చేస్తూ గనుల వారీగా పంపకాలు చేస్తున్నారు. యూనియన్ వ్యవహారాల్లో యాక్టివ్‌గా తిరిగే వారికి కూడా సిట్టింగ్‌లు చేసి మద్యం, మందులతో విందులు ఇస్తూ వారిని ఉత్తేజపరుస్తున్నారు. గెలిస్తే పిట్ కమిటీ, డివిజన్ కమిటీల్లో కీలక పదవులు వస్తాయని ఆశపడుతున్న నేతలు కొందరు ఈ విందులకు తమ సొంతడబ్బులు పెట్టి కార్మికులను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం ఎన్నికలు కావడంతో కార్మికులనుప్రసన్నం చేసుకోవడానికి ఈ ఒక్కరోజే మిగిలింది. ఈ రోజుంతా విందుల జాతరే జరగనుంది.

గత ఎన్నికలతో పోల్చితే తక్కువే..

ఇదిలా ఉంటే క్రితంసారి గుర్తింపు సంఘం ఎన్నికలతో పోల్చితే ఈసారి మందు, విందులు తక్కువగానే కనిపిస్తున్నాయి. అప్పుడు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా టీబీజీకేఎస్ నేతలు విచ్చల విడిగా ఖర్చు చేశారు. వారం ముందు నుంచే ఫంక్షన్‌హాళ్లలో మీటింగ్‌లు పెట్టి మద్యం, మాంసంతో విందులు ఇచ్చారు. ఆ ఎన్నికల సమయంలోనే దసరా రావడంతో ఏకంగా లారీ లోడ్ మేకలు తెప్పించి గ్యాంగ్‌ల వారీగా పంపిణీ చేశారు. క్రితం సారిలా అడ్డగోలు విందుల వ్యవహారాలు ఈసారిలేవని కొందరు కార్మిక సంఘాల నేతలే పేర్కొంటున్నారు.

జీపీల అభివృద్ధికి నిధులేవి?

- పంచాయతీలపై గత ప్రభుత్వం శీతకన్ను
- అప్పులు తెచ్చి మరీ పనులు చేసిన సర్పంచులు
- ఫిబ్రవరి 1తో ముగియనున్న పదవీకాలం



హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జాతిపిత మహాత్మా గాంధీ మాటను గత పాలకులు పెడచెవిన పెట్టారు. పంచాయతీ పాలకవర్గాలు 2019 ఫిబ్రవరి 2న పదవీ బాధ్యతలు చేపట్టాయి. కొంతకాలం వరకు సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వక పోగా దాదాపు రెండేళ్ల పాటు అరకొర నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాలం వెల్లదీయడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. మరోవైపు కొందరు సర్పంచులు అప్పులు చేసి మరీ చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కేంద్రం ఇచ్చే పన్నులు, గ్రాంట్లపై ఆధారపడ్డారు. పారిశుధ్య పనులు, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు కేంద్ర నిధులు వెచ్చిస్తూ ఎలాగోలా నెట్టుకొచ్చారు. కేంద్రం గ్రాంట్ రెండు, మూడు నెలలకోసారి రావడం, అందులో నుంచి విద్యుత్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం మినహాయించుకోవడం సర్పంచులకు తలనొప్పిగా మారింది.

జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు

జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ పంచాయతీల సర్పంచులు రెండేళ్లుగా నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. రూ.10 లక్షల వరకు ఖర్చుపెట్టి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పాలకవర్గాల పదవీ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న ముగియనుండగా ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. కొత్త ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సుముఖంగా ఉంటుందా? లేదా పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ పాలనకు మొగ్గు చూపుతుందా? అనేది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా నూతన ప్రభుత్వంలోనైనా తమ బిల్లులు మంజూరవుతాయా లేదా అన్న ఆందోళన సర్పంచుల్లో నెలకొంది.

బిల్లులు పాస్ కావడం లేదు..



పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పాస్ కావడం లేదు. ఎలాంటి నిధులు రాక జీపీల్లో అభివృద్ధి కుంటుపడింది. పూర్తి చేసిన పనులకు సంబంధించి ఎంబీలు చేసి ఉన్నా, పలు బిల్లులను ట్రెజరీలకు పంపితే మంజూరుకావడం లేదు. మరో నెల రోజుల్లో మా పదవీ కాలం పూర్తవుతుంది. బిల్లులు పాస్ చేస్తే గౌరవంగా దిగిపోతాం.

– జూపాక రాజేశ్వరి, సర్పంచ్, హాజీపూర్

‘వైద్యుల సమస్యలపై పోరాటం చేస్తాం’



మాట్లాడుతున్న యెగ్గన శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: వైద్యుల సమస్యలపై పోరాటం చేస్తామని, నకిలీ వైద్యులు, వైద్యంకు సంబంధం లేని వారిచే ఏర్పాటు చేసే ఆస్పత్రులపై కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటామని డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి(టీఎస్‌ఎంసీ)కి ఎన్నికలు లేకపోవడంతో తమ ప్యానెల్ హెచ్‌ఆర్‌డీఏ పోరాటం చేసి హైకోర్టు, సుప్రీంకోర్టులలో ఉన్న కేసులను గెలిచి ఎన్నికల వరకు వెళ్లిందన్నారు. 42 వేల మంది ఓటర్లుగా వైద్యులు ఉండగా ఎన్నికల్లో 13 మంది హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించిందన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి తాను హెచ్‌ఆర్‌డీఏ సభ్యుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని, తమ ప్యానెల్ ఆధ్వర్యంలోనే టీఎస్‌ఎంసీ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో వైద్యులు విశ్వేశ్వర్, అనిల్ కుమార్, సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విహారం.. విషాదాంతం

- సాగర్ వెనుకజలాల్లో మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- మృతుడు నిర్మల్ జిల్లా వాసి



ఆశిశ్ మృతదేహం

చందంపేట: విద్యార్థుల విహారయాత్ర చివరకు విషాదాంతంగా ముగిసింది. సాగర్ వెనుక జలాల్లో మునిగి ఓ బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం గ్రామానికి చెందిన గంద్ర మనోహర్ కుమారుడు ఆశిశ్ (25) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనలీయర్ చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులను సరదాగా గడిపేందుకు ఆశిశ్ తన నలుగురు స్నేహితులతో కలిసి సోమవారం చందంపేట మండలం వైజాగ్ కాలనీకి వచ్చాడు. అక్కడ ఈత కొట్టేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగారు. ఈ క్రమంలో ఆశిశ్ అంబాభవాని లిఫ్ట్ పనులు జరుగుతున్న కాల్వవైపు వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో వెంట వచ్చిన నలుగురు స్నేహితులు బయటికి వచ్చి విషయం చెప్పడంతో స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లు నీటిలోకి దిగి మృతదేహాన్ని వెలితీశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చందంపేట ఎస్సై రాజు తెలిపారు.